www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 11 అక్టోబర్ 2024



యుద్ధోన్మాదం వద్దు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

మారణహోమానికి కారణమయ్యే యుద్ధాలు వద్దనీ, ప్రపంచశాంతి కోసం అందరూ ముందడుగు వేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి గంధం మణి పిలుపునిచ్చారు. ఇజ్రాయెల్-పాలస్తీనా యుద్ధంకు వ్యతిరేకంగా స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. యుద్ధాల వెనుక అగ్రరాజ్యం అమెరికా కుట్ర దాగి ఉందనీ, సామ్రాజ్యవాదాన్ని విస్తరింప చేయడానికి దేశాల మధ్య చిచ్చు పెడుతోందని ఆరోపించారు. అమెరికా వైఖరినీ, యుద్ధోన్మాదాన్ని ప్రతి ఒక్కరూ మానవతా భావంతో తిప్పుకొట్టాలని పిలుపునిచ్చారు. నాయకులు పెనగడం గురవయ్య, కుమార్, వెలివేంద్రం, లాల్ బాషా, వెంకటేష్, ఉస్మాన్ బాషా, అన్వర్ భాషా, షరీఫ్, రమేష్, పాస్టర్ సుందర రాజన్ పాల్గొన్నారు.

మళ్లీ తెరపైకి... గరుడ వారధి

'గరుడ వారధి పోయి శ్రీనివాస సేతు వచ్చే.. మళ్లీ శ్రీనివాస సేతు పోయి గరుడ వారధి వచ్చే'.. ఇదీ పాలకుల ఆలోచన తీరు.. తిరుపతి స్మార్ట్ సిటీ పథకంలో రూ.648 కోట్లతో నిర్మించిన శ్రీనివాస సేతు పేరును మార్చాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. త్వరలో జరగనున్న కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదన పెట్టి తీర్మానం చేయాలని నిర్ణయించారు. అయితే కార్పొరేషన్ లో వైసీపీ బలం ఉండడంతో మేయర్ డాక్టర్ శిరీష నేతత్వంలో జరిగే కౌన్సిల్ సమావేశంలో శ్రీనివాస సేతు పేరు మార్పును వారు అంగీకరిస్తారా లేదా అన్నది కౌన్సిల్ సమావేశం జరిగే వరకూ వేచి చూడాల్సిందే.

● 'శ్రీనివాస సేతు' మార్పుకు ప్రతిపాదన ● వైసీపీ కార్పొరేటర్లు ఆమోదించేనా..?

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

2019 అసెంబ్లీ ఎన్నికల సమయంలో టిడిపి ప్రభుత్వం గరుడ వారధి పేరుతో తిరుచానూరు మార్కెట్ యార్డ్ నుంచి కపిల తీర్థం వరకు ఏడు కిలోమీటర్ల వరకు నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. ఎన్నికల కోడ్ రాకముందు గరుడ వారధి పనులు జోరుగా సాగాయి. ఆ ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గరుడవారధి పేరు మార్చి శ్రీనివాస సేతు పేరును కౌన్సిల్లో తీర్మానం చేసి ఆమోదించారు. అప్పటి నుంచి శ్రీనివాస సేతుగా పిలిచేవారు. దీనికి సంబంధించిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంతో ఏడాది క్రితం అప్పటి సీఎం జగన్ మోహన్ రెడ్డి శ్రీనివాస సేతును ప్రారంభించారు. ఇప్పుడు టిడిపి కూటమి అధికారంలోకి రావడంతో తమ హయాంలో చేపట్టిన పనులను వైసీపీ ప్రభుత్వం పేరు మార్చి పెట్టడం అప్పట్లో టిడిపి అభ్యంతరం తెలిపిన విషయం తెలిసిందే. త్వరలో జరిగే కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో శ్రీనివాస సేతు పేరును మార్చి గరుడ వారధి పేరు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ఫైల్‌ను కార్పొరేషన్ అధికారులు సిద్ధం చేశారు. టిడిపి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు శ్రీనివాస సేతు పేరు మార్చి గరుడ వారధిగా పెట్టాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఇదిలా ఉండగా తిరుపతి కార్పొరేషన్‌లో వైసీపీ పార్టీకి చెందిన కార్పొరేటర్‌లు అధికంగా ఉన్నారు. జనసేన టిడిపి పార్టీలకు చెందిన కార్పొరేటర్లు తక్కువ మంది ఉన్నారు. ఈనెల నెల నాలుగో తేదీ జరగాల్సిన స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నికల ప్రక్రియ కూటమి పార్టీకి చెందిన కార్పొరేటర్లు తక్కువ మంది ఉండడంతో వాయిదా పడిన విషయం తెలిసిందే. 2020 కార్పొరేషన్ ఎన్నికల్లో 50 డివిజన్లకు గాను 49 డివిజన్లకు ఎన్నికలు జరిగాయి. అందులో 35వ డివిజన్ టిడిపి కార్పొరేటర్ ఆర్ సి ముని కష్ణ ఒకరే గెలిచారు మిగిలిన వారందరూ వైసిపి కార్పొరేటర్ గా గెలిచారు. మేయర్ తో పాటు ఇద్దరు డిప్యూటీ మేయర్లు వైసిపి వారే ఉన్నారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేసి ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. ఆ ఎన్నికల సమయంలోనే టిడిపి జనసేన నుంచి కొంత మంది కార్పొరేటర్లు చేరిపోయారు. టిడిపి జనసేన సంబంధించి 12 మంది మాత్రమే కార్పొరేటర్లు ఉన్నారు. మిగిలిన వారంతా వైసిపి కార్పొరేటర్లుగానే ఇప్పటికీ కొనసాగుతున్నారు.

ఒకవేళ కౌన్సిల్లో మెజార్టీ సభ్యులు శ్రీనివాస సేతు పేరును కొనసాగించాలని డిమాండ్ చేసినా గరుడ వారధి పేరును మార్చడం ఖాయమైనట్టు తెలుస్తోంది.

ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సు డ్రైవర్ల ధర్నా

వెంటనే వేతనాలు చెల్లిస్తామని ఆర్ఎం హామీ

సిఐటియు ఆధ్వర్యంలో ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సు డ్రైవర్ల ధర్నా

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

నెలల తరబడి పెండింగ్‌లోఉన్న వేతనాలు వెంటనే ఇవ్వాలని, రెస్ట్‌రూమ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ అలిపిరి ఆర్టీసీ డిపోలోని ఎలక్ట్రికల్ బస్సు డ్రైవర్లు సిఐటియు ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. వేతనాలను సక్రమంగా ఇవ్వకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులతో ఓ కార్మికుడు బుధవారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారన్నారు. సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో అలిపిరి డిపో ముందు డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. నగర ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్ అధ్యక్షత వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి జి.బాలసుబ్రమణ్యం, కందారపు మురళి మాట్లాడుతూ కార్మికుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యాత్రికులను, ఉద్యోగులను సురక్షితంగా తిరుమల కొండకు చేరుస్తున్న డ్రైవర్ల పట్ల యాజమాన్యం దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు. నెలనెలా జీతాలు ఇవ్వకపోతే వారి కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రశ్నించారు. కార్మిక చట్టం ప్రకారం ఇఎస్ఐ, పిఎఫ్ అమలు చేయడం లేదన్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారి పట్ల దుర్మార్గంగా వ్యవహరించడం సరికాదన్నారు. డ్యూటీ చేసిన తరువాత కనీసం కొద్దిసేపు విశ్రాంతి తీసుకునేందుకు రెస్ట్ రూమ్‌లు లేక, ఫుట్‌పాత్‌లపైనే ఉండాల్సి వస్తోందన్నారు. కుటుంబ సమస్యలతో బుధవారం రఘు అనే కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డారని, పూర్తి బాధ్యత యాజమాన్యందేనన్నారు. సమస్య పరిష్కరించేంత వరకూ ఆందోళన విరమించేది లేదన్నారు. సమస్య తీవ్రతను గుర్తించిన ఆర్టీసీ ఆర్ఎం ధర్నా వద్దకు విచ్చేసి కార్మికులకు వేతనాలను సాయంత్రానికల్లా ఇస్తామని హామీ ఇచ్చారు. ఆర్టీసీ అధికారులను విజయవాడ నుంచి రెండు రోజుల్లో పిలిపించి కాంట్రాక్టర్‌తోనూ, కార్మిక సంఘం సిఐటియు నేతలతో చర్చలు జరిపి మిగిలిన సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు ధర్నాను తాత్కాలికంగా విరమిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నేతలు ఆర్.లక్ష్మి, టి.సుబ్రమణ్యం, పి.బుజ్జి, పి.మునిరాజా, జి.చిన్నబాబు, జి.వాసు, శ్రీరాములు, తంజావూరు మురళి పాల్గొన్నారు.

రేపు 'జీ తెలుగు కుటుంబం' అవార్డ్స్ ప్రదానోత్సవం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ఈ నెల 12వ తేదీన దసరా సందర్భంగా జీ తెలుగు కుటుంబ అవార్డు ప్రదానోత్సవం జరుగుతుందని ఉమ్మడి చిత్తూరు జిల్లా జీ నెట్వర్క్ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. జీ తెలుగు తారలు, టాలీవుడ్ ప్రముఖులతో సందడిగా సాగిన జీ తెలుగు కుటుంబం అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమ మొదటి భాగం అక్టోబర్ 12 సాయంత్రం 6 గంటలకు మీ జీ తెలుగులో.. తప్పక చూడాలన్నారు. ఈ కార్యక్రమానికి ఎనర్జిటిక్ జోడీ రవి- లాస్య వ్యాఖ్యాతలుగా వ్యవహరించారని తెలిపారు.

ప్రజా కళావేదిక పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాస్ చేతుల మీదుగా గురువారం నూతనంగా ఏర్పాటైన ప్రజా కళావేదిక పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజా కళావేదిక చైర్మన్ అరవ జయపాల్‌ను అభినందించారు. అరవ జయపాల్ మాట్లాడుతూ ఈ ప్రజా కళావేదిక ద్వారా కవులు కళాకారులనే కాక, తెలుగు భాష అభివద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని హై స్కూల్ స్థాయి నుంచి కాలేజీ స్థాయి వరకు తెలుగు భాష పై పలు రకాల వ్యాసాలతో పాటు పలురకాల సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా పిల్లలకు అవగాహన కల్పించే విధంగా ఉంటుందని తెలిపారు.

రైతుబజారుల్లో సరసమైన ధరలకే నిత్యావసరాలు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

మార్కెట్ ధరల కంటే తక్కువ ధరలకే వంట నూనెలను వినియోగదారులకు అందజేయడం జరుగుతుందని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలిసి తిరుపతి పట్టణంలోని బేరువీధిలోని గోపి కష్ణ ఆయిల్ స్టోర్ నందు రూ.135 విలువగల పామయిల్ ను 117 రూపాయలకు, 145 రూపాయల విలువగల సన్ ఫ్లవర్ ఆయిల్‌ను 128 రూపాయలకు వినియోగదారులకు కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఇద్దరు కలసి పంపిణీ చేశారు. జిల్లా పౌరసరఫరాల అధికారి శేషాచలం రాజు,డిప్యూటీ తహశీల్దార్ జయరామ్ పాల్గొన్నారు.

శెట్టిపల్లి భూములను పరిశీలించిన కలెక్టర్

త్వరలో తుడాకు శెట్టిపల్లి భూములు

ప్రత్యేక జీవో ద్వారా పరిష్కారం :కలెక్టర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

శెట్టిపల్లి భూములను త్వరలో తిరుపతి పట్టణాభివద్ధి సంస్థ (తుడా) కు బదిలీ చేసి శాశ్వత పరిష్కారం చూపేలా ప్రత్యేక జీవో ప్రభుత్వం నుండి వెలువడుతుందని కలెక్టర్ వెంకటేశ్వర్ శెట్టిపల్లి భూ బాధితులకు హామీ ఇచ్చారు. ఈ మేరకు గురువారం నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, తుడా, ఆర్డీవో, రెవెన్యూ అధికారులతో కలిసి శెట్టిపల్లి భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ శెట్టిపల్లి భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడానికి రెవెన్యూ,ల్యాండ్ అండ్ సర్వే, మునిసిపల్ కార్పొరేషన్ అధికారుల సమన్వయం చేసుకొని భూ సర్వే పనులు త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. శెట్టిపల్లి భూ బాధితుల కమిటీ అధ్యక్షులు రాధాకష్ణ, కార్యదర్శి శ్రీను మాట్లాడుతూ దశాబ్దాలుగా శెట్టి పల్లె భూ సమస్య పరిష్కారానికి నోచుకోలేదని, అధికారులు మారిన ప్రతిసారి శెట్టిపల్లె భూ సమస్యను తామే వివరించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన కలెక్టర్ వెంకటేశ్వర్ శెట్టిపల్లె భూ సమస్యపై ఇప్పటికే సీఎం నారా చంద్రబాబు నాయుడు దష్టికి తీసుకెళ్లానని, భూ సర్వే తదితర అంశాలు పూర్తికాగానే రోజుల వ్యవధిలో శెట్టిపల్లె భూములను ప్రత్యేక జీవో ద్వారా తుడాకు అప్పజెప్పి శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. రైతులకు 30 శాతం, ఫ్లాట్లకు కొనుగోలుదారులకు 50శాతం, రెండు సెంట్లు భూమి తగ్గకుండా భూ సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. స్థానిక ప్రజలు శెట్టిపల్లి భూములలో మట్టిని తోలుకొని భూములను అస్తవ్యస్తంగా తయారు చేశారని కలెక్టర్ దష్టికి తీసుకురావడంతో స్పందించిన కలెక్టర్ మట్టి తీసుకెళ్లే వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తుడా ఎస్ఈ కష్ణారెడ్డి, ల్యాండ్ అక్విజిషన్ అధికారిణి సుజన, ఈఈ రవీంద్రయ్య, టిపిఓ దేవికుమారి, ఆర్డీఓ, డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్, అర్బన్ తహశీల్దార్ భాగ్యలక్ష్మి, డిటిలు అశోక్, కిరణ్, ఆర్ఐ జానీ భాష, విఆర్ఓలు, శెట్టిపల్లి భూ బాధితుల కమిటీ సభ్యులు రాజేంద్ర, ఆవుల సురేష్ యాదవ్, కష్ణ, షణ్ముగం, గోడ్ల నాదముని, మురుగేష్, నజీర్ బాష పాల్గొన్నారు.

(ఫైల్‌ఫొటో) శ్రీసిటీలో..

రతన్ టాటాకు శ్రీసిటీ ఎండీ ఘన నివాళి

ప్రజాశక్తి -వరదయ్యపాలెం, యంత్రాంగం

గొప్ప దార్శినికతకు, భారతీయ పరిశ్రమకు, దాతత్వానికి మారుపేరైన టాటా సన్స్ గ్రూప్ మాజీ చైర్మన్ రతన్ నావల్ టాటా మతి పట్ల శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. 2019, ఏప్రిల్ 16న రతన్ టాటా శ్రీసిటీ సందర్శించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆ నాటి పర్యటనలో 'అంకితభావం, చిత్తశుద్ధితో ఏమి సాధించవచ్చో చెప్పడానికి శ్రీసిటీ సరైన ఉదాహరణ' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు తమకెంతో గౌరవప్రదమని అన్నారు. దేశంలో రెడీ-టు-ఈట్ మార్కెట్‌లో రెండవ అతిపెద్ద సంస్థగా పేరున్న టాటా స్మార్ట్‌ఫుడ్జ్ లిమిటెడ్ పరిశ్రమ స్థాపిండానికి శ్రీసిటీని ఎన్నుకున్నారని, అలాగే శ్రీసిటీలోని క్రియా విశ్వవిద్యాలయం పాలక మండలికి సలహాదారుగా ఉన్నారనిరతన్ టాటాకు శ్రీసిటీతో వున్న అనుబంధాన్ని రవీంద్ర సన్నారెడ్డి ప్రస్తావించారు.

పుత్తూరులో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయబాబు ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. భారతీయ పారిశ్రామిక రంగంలో ఓ వెలుగు వెలిగిన ధృవతార అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి రవినాయుడు, పరమేశ్వర మంగళం ఎంపిటిసి శ్రీజ బాలాజీనాయుడు, జి.ధనపాల్, దాసరి విజయ్‌చౌదరి పాల్గొన్నారు.

తిరుపతి సిటీలో.. ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం టాటా క్యాన్సర్ ఆస్పత్రిలో నివాళి అర్పించారు. దేశ పారిశ్రామిక రంగ అభివృద్ధిలో రతన్‌టాటా చెరగని ముద్ర వేశారన్నారు. కోవిడ్ సమయంలో 1,500 కోట్లు పిఎం రిలీఫ్ ఫండ్ కి ఇవ్వడమే కాకుండా విద్యా రంగానికి, స్టార్ట్ అప్ లకు ఇతోదిక సాయం రతన్ టాటా అందించారని ఆయన తెలిపారు. తిరుపతిలో 250కోట్లతో టాటా క్యాన్సర్ హాస్పిటల్ స్థాపించి పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించిన మహోన్నతుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దంపూరి భాస్కర్, డాక్టర్ ప్రశాంత్, మహేష్ యాదవ్, బాబ్జీ, కేఎంకే లోకేష్, రుయా ఆస్పత్రి అభివద్ధి సొసైటీ వర్కింగ్ చైర్మన్ లక్ష్మీపతి రాయల్, రమణరాజు తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిని జయించేందుకు వ్యాయామం

ప్రజాశక్తి - తిరుపతి, దొరవారిసత్రం

పని ప్రదేశాల్లో ఒత్తిళ్లు ఉంటున్నాయని, దీన్ని జయించేందుకు ప్రాణాయామం, వ్యాయామం చేయాలని వక్తలు ఉద్ఘాటించారు. స్విమ్స్ సెకియాట్రి విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకని గురువారం ఉదయం అవగాహనా ర్యాలీని, సభను నిర్వహించినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. శ్రీ పద్మావతి ఆస్పత్రి నుంచి వాల్మీకి సర్కిల్ వరకూ వాక్‌థాన్ నిర్వహించారు. యస్.పి.యం.సి.డబ్ల్యు ప్రిన్సిపల్ డాక్టర్ ఉషాకళావత్, కార్డియాలజి సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ వనజాక్షమ్మ, సెకియాట్రిస్ట్ విభాగాధిపతి డాక్టర్ గణేష్ కుమార్, డాక్టర్ దుర్గాంజలి సంయుక్తంగా జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మానసిక ఒత్తిడిని జయించి ముందుకు వెళ్లేందుకు ప్రాణమాయం, వ్యాయమం, మంచి ఆహార నియామాలు పాటిస్తూ మానసిక, శారీరక ఉల్లసంతో మందుకెళ్లాలని పిలుపునిచ్చారు. అలాగే మద్యం, పొగత్రాగడం ఇతర చెడు వ్యసనాల బారిన పడి తమ ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్న వారికి స్విమ్స్ సెకియాట్రీ విభాగంలో కౌన్సిలింగ్ అందిస్తున్నామని తెలియజేశారు.

దొనవారిసత్రంలో కృష్ణాపురంలోని మహేర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నడుపుతున్న మానసిక వికలాంగుల కేంద్రంలో వైద్యశిబిరం నిర్వహించారు. అధికమైన ఆలోచనలు, మానసిక ఒత్తిడికి దూరంగా ఉండాలన్నారు. ఆరు మాసాలకు ఓ పర్యాయం ఆల్బెండజోల్ మాత్రలు ప్రతి ఒక్కరికి ఇవ్వాలని అందించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏ ఎన్ ఎం డోరతి, శ్రావణి, ఆశ కార్యకర్త వీరమ్మ, మహేర్ మానసిక వికలాంగుల కేంద్రం ఇంచార్జ్ సిస్టర్ బ్రోని, అసిస్టెంట్ ఇంచార్జ్ కె. ప్రసాద్ పాల్గొన్నారు.

ఛాత్రోపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ టీచర్ ట్రైనింగ్ కళాశాలలో 2012-14 విద్యా సంవత్సరంలో డిప్లమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ పూర్తిచేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం స్థానిక స్కిమ్స్ కళాశాలలో గురువారం జరిగింది. కరస్పాండెంట్ మిద్దెల హరి మాట్లాడుతూ తమ కళాశాలలో 2012-14 బ్యాచ్ టీచర్ ట్రైనింగ్ కోర్స్ అభ్యసించిన అనేకమంది విద్యార్థులు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపికైనందుకు ఆనందం వ్యక్తం చేశారు. గుణాత్మకమైన విద్యతో పాటు క్రమశిక్షణ, విలువలతో కూడిన వ్యక్తిత్వ వికాస బోధనలు చేయడం ద్వారానే ఈరోజు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా తాము ఫలవంతమైన జీవితాన్ని అనుభవించగలుగుతున్నామని పూర్వ విద్యార్థులు తెలియజేశారు. మాజీ ప్రిన్సిపాల్ శ్రీకుమార్, రిటైర్డ్ ప్రొఫెసర్లు సత్యనారాయణ రావు, అన్వర్ ఖాన్ బహమని, చంద్రశేఖర్, స్కిమ్స్ ప్రిన్సిపాల్ గీతా దేవి తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ అధికారులు వస్తారని 'పరార్'

ప్రజాశక్తి - ఏర్పేడు



ఏర్పేడు మండలంలోని స్వర్ణముఖి నది రీచ్‌లో అక్రమంగా తరలిస్తున్న ఇసుక మాఫియా గురువారం మైనింగ్ అధికారులు వస్తారని ముందస్తు సమాచారం అందడంతో హిటాచిని నది పక్కనే వదిలిపెట్టి, ట్రాక్టర్లు, టిప్పర్లు ఇసుక తరలించే ప్రదేశంలో లేకుండా జాగ్రత్తపడి పరారయ్యారు. ఏర్పేడు మండలంలో స్వర్ణముఖి నదిలో మోదుగులపాలెం వద్ద ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు అధికారులు హెచ్చరించిన, ఇసుక మాఫియా పట్టించుకోకపోగా వారు ఏర్పాటు చేసిన మట్టి రోడ్డుకు అధికారులు ట్రెంచ్ వేసిన మరలా దర్జాగా మట్టి రోడ్డునే ఏర్పాటు చేసి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని చుట్టుప్రక్క గ్రామస్తులు వాపోతున్నారు. అయితే శ్రీకాళహస్తి నియోజకవర్గం లోని తొట్టంబేడు మండలంలో ని ఇరుపాక్షపురం రీచ్ వద్ద బుధవారం మైనింగ్ అధికారులు రైడింగ్ చేపట్టడంతో అప్రమత్తమైన ఇసుక దొంగలు, ఏర్పేడు లోని స్వర్ణముఖి నది పక్కన హిటాచిని వదిలిపెట్టి పరారయ్యారు. ఏదిఏమైనా ఏరే పడు ఎంఆర్ఒ, పోలీసు అధికారులు కఠినంగా చర్యలు తీసుకోకుంటే ఇసుక దందా యథేచ్ఛగా కొనసాగుతుందని గ్రామస్తులు వాపోతున్నారు.

కొండంతా...ఆధ్యాత్మిక శోభ

విద్యుత్ వెలుగుల్లో దేవతామూర్తులు తిరుమల భక్తులకు కనువిందు



ప్రజాశక్తి - తిరుమల

శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా టీటీడీ విద్యుత్ శాఖ తిరుమలలో ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణతో తిరుమల కొండ వైకుంఠాన్ని తలపిస్తోందని భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తిరుమల శోభ చూడానికి రెండు కళ్లు చాలడం లేదని, వైకుంఠం భువికి దిగివచ్చిందా అన్న చందంగా విద్యుత్ కాంతులతో తిరుమల కొండ భక్తులు రాత్రుల్లో కొండ అందాలను కనులారా వీక్షిస్తున్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా వాహన సేవలను వీక్షించేందుకు వచ్చిన లక్షలాదిమంది భక్తులను ఆకట్టుకునేందుకు శ్రీవారి ఆలయాన్ని ప్రత్యేకమైన పార్కన్, ఫకాడ్ లైటింగ్‌తో టీటీడీ అలంకరించింది. రంగురంగుల కాంతులతో శ్రీవారి ఆలయ గోడలను, మహాద్వార గోపురం, మాడ వీధులు, ముఖ్యమైన కూడళ్లు, ఆర్చిల వద్ద భక్తులు మైమరచేలా విద్యుత్ వెలుగులను శోభాయమానంగా అలంకరించారు. తిరుమలలోని ఇతర ఆలయాలు, గార్డెన్లు, చెట్లను ప్రత్యేక విద్యుత్ కాంతులతో సినిమా సెట్టింగ్ లను తలపించేలా అలంకరించారు. పురాణాలు, ఇతిహాసాల్లోని దేవతల రూపాలతో తిరుమల కొండ మొత్తం విద్యుత్ బోర్డులు ఏర్పాటు చేయడంతో భక్తి పారవశ్యంతో భక్తులు ఆధ్యాత్మిక వాతావరణంలో ఆహ్లాదంగా విహరిస్తున్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలను కలియుగ వైకుంఠంగా అనుభూతి కలిగించేలా విద్యుత్ అలంకరణలకు టీటీడీ రూ.2.20కోట్లు మంజూరు చేసింది. శ్రీవారి ఆలయ ప్రాంగణం, కళ్యాణ వేదిక, కూడళ్ల వద్ద టీటీడీ 14 భారీ ఎలక్ట్రికల్ బోర్డులు, 30 చిన్న ఎలక్ట్రికల్ బోర్డులను ఏర్పాటు చేసింది. లక్ష్మీ వేంకటేశ్వర, సీతా రాములు, శ్రీరామ పట్టాభిషేకం, మహా విష్ణు, విశ్వరూపం, దశావతార రూపాలను భారీ ఎలక్ట్రికల్ బోర్డులతో ఏర్పాటు చేశారు. అష్ట లక్ష్ములు, తుంబూరుడు, అన్నమాచార్యుడి వంటి ఇతర రూపాలతో మరో 30 ఎలక్ట్రికల్ బోర్డులను ఏర్పాటు చేశారు. భక్తులకు విస్మయం కలిగేలా విద్యుత్ కాంతుల అలంకరణకు 100 మందికి పైగా టీటీడీ విద్యుత్ శాఖ సిబ్బంది నెల రోజులకు పైగా తీవ్రంగా శ్రమించారు.

విద్యుత్ అలంకరణలపై టీటీడీ ఈఓ జె.శ్యామలరావు మాట్లాడుతూ శ్రీవారిని అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించే భక్తులను బ్రహ్మోత్సవాల్లో ఆకట్టుకునేలా ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా విద్యుత్ అలంకరణలను ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామని తెలియజేశారు. భక్తులు వాహన సేవలను తిలకించేందుకు తిరుమలలోని శ్రీవారి ఆలయ మాడ వీధులు, మ్యూజియం, వరాహస్వామి రెస్ట్ హౌస్, అన్నదానం కాంప్లెక్స్, రాంభగీచా, ఫిల్టర్ హౌస్, ఇతర ప్రాంతాల్లో 32 భారీ డిజిటల్ స్క్రీన్లను టీటీడీ ఏర్పాటు చేసింది. బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలకు విచ్చేసిన భక్తులను ఆకట్టుకునేలా జీఎన్సీ ఏరియాతో పాటు పలు పార్కుల్లో దేవతా రూపాలతో ప్రత్యేక ఎలక్ట్రికల్ కటౌట్ లు ఏర్పాటు చేశారు. తిరుమలలోనే కాకుండా తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనం, బస్టాండ్, రైల్వే స్టేషన్ స్వాగత తోరణాల వద్ద ప్రత్యేకమైన విద్యుత్ అలంకరణలను టీటీడీ ఏర్పాటు చేసింది.

చక్రస్నానం ఏర్పాట్లపై టీటీడీ ఈఓ తనిఖీలు

తిరుమల : శనివారం నిర్వహించనున్న చక్రస్నానం ఏర్పాట్లపై టీటీడీ ఈఓ జె.శ్యామల రావు అధికారులతో కలసి గురువారం శ్రీవారి పుష్కరిణీ వద్ద తనిఖీలు నిర్వహించారు. ప్రవేశ మార్గాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అడిషనల్ ఈఓ సీహెచ్.వెంకయ్య చౌదరి, జేఈఓలు వీరబ్రహ్మం, గౌతమి, తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ సీవీఎస్వో శ్రీధర్ పాల్గొన్నారు.

'సాగు'ను ప్రోత్సహించేందుకే 'శిక్షణ'

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

అన్నదాత సేవకు మించిన సేవ సృష్టిలో ఇంకేమీ లేదని, సాగును ప్రోత్సహించేందుకే రైతులకు 'శిక్షణ' ఇస్తున్నట్లు వ్యవసాయ శాఖ జిల్లా ట్రైనింగ్ కోఆర్డినేటర్ భాస్కరయ్య తెలిపారు. వెంకటగిరి సబ్ డివిజన్ పరిధిలో గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, ఎంపిఇఒల శిక్షణా కార్యక్రమం జరిగింది. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల కారణంగా నేడు సాగు సమస్యల్లో పడిందన్నారు. రైతులకు శాస్త్ర సాంకేతిక విషయాలను అందించేందుకు గ్రామస్థాయి విస్తరణ అధికారుల పాత్ర కీలకమని, విషయ పరిజ్ఞానం, వాక్చాతుర్యం, సహనం, సేవా దృక్పథం ఉండాలన్నారు. పెరియవరం కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి నిమ్మచెట్లలో మేలైన యాజమాన్య పద్ధతులను వివరించారు. జిల్లా వనరుల కేంద్రం ఎఒ వేణుగోపాలరావు, వెంకటగిరి సబ్ డివిజన్ ఎడిఎ నాగార్జున, ప్రకృతి వ్యవసాయ అధికారి ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.

తాతయ్యగుంట గంగమ్మ మాజీ ఈఓ మృతి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ ఆలయ మాజీ ఈఓ పోలి సుబ్రమణ్యం గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, కార్పొరేటర్ ఆర్.సీ. మునికృష్ణ, టౌన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ బాల సుబ్రహ్మణ్యం రెడ్డి ఆయన నివాసానికి చేరుకుని పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రిలీవ్ చేయండి మహాప్రభో.!

- పంచాయతీ డీడీవోల మొర



ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: బదిలీ ఉత్తర్వులు అందినా తమను రిలీవ్ చేయడం లేదని పంచాయతీ డీడీవోలు గగ్గోలు పెడుతున్నారు. నియమించిన చోటకు వెళ్లాలని.. వెంటనే తమను రిలీవ్ చేయాలని మండల స్థాయి అధికారుల వద్ద మొరపెట్టుకుంటున్నారు. కేవీబీ పురం మండలంలో 19సచివాలయాలు ఉన్నాయి. ఒకొక్క సచివాలయానికి ఒకరు చొప్పున డీడీవోలు ఉండాలి. అయితే ఉన్న 10మంది డీడీవోలకు 19 సచివాలయలకు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఇన్నాళ్లు ఆయా సచివాలయాల పరిధిలో వారు విధులు నిర్వర్తించారు. కాగా ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో 9మందికి బదిలీ ఉత్తర్వులు అందాయి. అయితే ప్రభుత్వం వారిని నియమించిన చోటకు వెళ్లి బాధ్యతలు చేపట్టాల్సి ఉంది. అయితే తమను రిలీవ్ చేయకుండా అధికారులు, మండల నాయకులు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని డీడీవోలు చెబుతున్నారు. ఉన్నతాధికారులైనా స్పందించి తమకు ఇక్కడ నుంచి రిలీవ్ చేయించాలని వాపోతున్నారు. చిన్నస్థాయి ఉద్యోగులను ఇబ్బంది పెట్టడం సరికాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విడిది మండపాలను పూర్తి చేయండి

అసంపూర్తిగా ఉన్న విడిది మండపాలు చూపుతున్న శ్రీనివాసులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్వామీ అమ్మవర్ల గిరి ప్రదక్షిణ మార్గంలో చేపట్టిన విడిది మండపాలను వెనువెంటనే పూర్తి చేయాలని ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం ఆయన అసంపూర్తిగా ఉన్న విడిది మండపాలను పరిశీలించారు. కైలాసగిరి ప్రదక్షణ మార్గంలో ఉన్న పురాతన విడిది మండపాలు కనుమరుగు కావడంతో, వైసిపి ప్రభుత్వ హయాంలో 9 మండపాల నిర్మాణానికి పునాదులు వేసినట్లు తెలిపారు. వాటిలో మూడు మండపాలు పూర్తికాగా, ఆరు మండపాలు నిర్మాణ దశలోనే ఆగిపోయాయని వివరించారు. మండపాలు పూర్తయితే భక్తులు విడిది కేంద్రాల్లో స్వామి అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో పూజలు చేసుకునే అవకాశం దక్కుతుందని చెప్పారు. అయితే ప్రభుత్వం మారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించక ఎక్కడ పనులు అక్కడ ఆగిపోయినట్లు తెలిపారు. మళ్లీ సంక్రాంతికి కైలాసనాధుడి గిరిప్రదక్షిణ ఉన్న నేపథ్యంలో ఈ లోపలే విడిది మండపాలను పూర్తిచేస్తే అన్ని విధాలా ఉపయోగకరంగా ఉంటుందని సూచించారు.

దసరా రోజున డీజేలకు అనుమతి లేదు

- గూడూరు డీఎస్పీ రమణ కుమార్

మీడియాతో మాట్లాడుతున్న డీఎస్పీ

ప్రజాశక్తి-గూడూరు టౌన్: దసరా పండుగ రోజున పట్టణంలో డీజేలకు అనుమతి లేదని గూడూరు డీఎస్పీ రమణ కుమార్ స్పష్టం చేశారు. గురువారం ఆయన గూడూరులో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. దసరా పండుగ రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన మాట్లాడారు. సుమారు 15వరకు అమ్మవార్ల గ్రామోత్సవాలు ఉంటాయని, ఊరేగింపు అన్నీ వీధుల్లో తిరగనున్న నేపథ్యంలో డీజేలు ఏర్పాటు చేయవద్దని స్పష్టం చేశారు. ఇదే విషయమై నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో వెల్లడించామన్నారు. ఈనెల 2వ తేదీన జరిగిన జెండా ఉత్సవంలో డీజే కారణంగా వివాదాలు జరిగాయని, బాధ్యులు శిక్ష అనుభవిస్తున్నారని గుర్తు చేశారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని అందరూ కలిసి పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆయన వివరించారు. సమావేశంలో సీఐ శేఖర్ బాబు, ఎస్ఐ సుబ్రమణ్యం రాజు పాల్గొన్నారు.

ఏపిఆర్ సెట్ తొలి విడత సీట్ల కేటాయింపు

ప్రజాశక్తి-క్యాంపస్: ఏపీ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో ఎస్వీయూ నిర్వహించిన ఏపిఆర్ సెట్ 2023-24లో ర్యాంకులు పొందిన అభ్యర్థులకు గురువారం తొలి విడత సీట్ల కేటాయింపు జరిగింది. ఈ సందర్భంగా రీసెట్ 2023-24 ఛైర్మన్ ఆచార్య కె.రామ్మోహన్ రావు, కన్వీనర్ ఆచార్య పి.సి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏపీలోని 17విశ్వవిద్యాలయాలలో సైన్స్, ఆర్ట్స్, మేనేజ్మెంట్, ఇంజనీరింగ్, ఫార్మసీ వంటి కోర్సుల్లో పీహెచ్‌డీ (పార్ట్ టైం, ఫుల్ టైం) 2566 సీట్లకు వెబ్ వెరిఫికేషన్ జరిపి సీట్ల కేటాయింపు చేశామని తెలిపారు. తొలి దశలో ఫుల్ టైం కోర్సుల్లో 771మంది, పార్ట్ టైం కోర్సుల్లో 1237మంది, మొత్తం 2008మందికి కేటాయింపు జరిగిందని తెలిపారు. అభ్యర్థులకు వెబ్ ఆప్షన్ల ఆధారంగా సీట్లు కేటాయింపు జరిగిందని, సీట్లు కేటాయింపు జరిగిన వారు ఆన్లైన్లో రిపోర్టు చేసి, సంబంధిత విశ్వవిద్యాలయాల్లో నేరుగా ఈ నెల 14 నుంచి 19వరకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరై సీటు ఖరారు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు అభ్యర్థులు http:// vets.apsche.ap.gov.in/APSCHE/APSCHEHome.aspx వెబ్సైటు చూడాలని కోరారు.

ఉచిత న్యాయ బోర్డులు ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: అందరికీ ఉచిత న్యాయం, న్యాయ సలహాలు అందేలా రద్దీ ప్రాంతాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో ఆదేశించారు. భారత న్యాయవ్యవస్థ ఆదేశాల ప్రకారం ప్రజలకు అందుబాటులో న్యాయ సేవలు తెలిపే సూచిక బోర్డుల్లో వెబ్ సైట్: (https://www.nalsa.gov.in/lsams/), హెల్ప్ లైన్ నెంబర్ 15100 ఉండేలా చూడాలన్నారు. ఆ బోర్డులను రైల్వే స్టేషన్లు, రైల్వే రిజర్వేషన్ కోచ్‌లలో, బస్టాండ్లు, బస్సులు, మెట్రో స్టేషన్లు, టాక్సీ స్టాండ్లు, అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, తపాలా కార్యాలయాలు, స్కూళ్లు, కాలేజీలు, హాస్పిటళ్లు, హెల్త్ కేర్ సెంటర్లు, మార్కెట్ చుట్టుపక్కల ప్రాంతాల్లో, కోర్టులు, పోలీస్ స్టేషన్ల ఆవరణలో ఉంచాలని సూచించారు.

విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: మండలంలోని పాపానాయుడుపేట గ్రామంలో దసరా ఉత్సవాల సందర్భంగా గురువారం విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. సుమారు 300మందికి దాసరి యువజన సమాఖ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని ఓం శ్రీ సాయి రాం వృద్ధాశ్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వైజెపి టౌన్ అధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవరచుకోవాలన్నారు. అనంతరం వృద్ధురాలికి వీల్ చైర్‌ను అందజేశారు. కార్యక్రమానికి దాతగా అంబటి రమణా రెడ్డి, రమాదేవిలు వ్యవహరించారు. కార్యక్రమంలో క్లబ్ పట్టణ అధ్యక్షులు సుబ్రమణ్యం, కార్యదర్శి పసుపు లేటి ప్రసాద్, పద్మనాభ రెడ్డి, రవీంద్ర రెడ్డి, మురళి నాయుడు, అర్‌వి రావు, ఎస్ఎల్ఎన్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్‌కు పరామర్శ

ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేట మాజీ కౌన్సిలర్ శేషం మునిగోపిని పలువురు టీడీపీ నాయకులు గురువారం పరామర్శించారు. మునిగోపి తల్లి శేషం మస్తానమ్మ మంగళవారం అనారోగ్యంతో బాధపడుతూ తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ యువ నాయకులు సుధీర్ రెడ్డి, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు అవధానం సుధీర్‌లు మునిగోపిని పరామర్శించి ధైర్యం చెప్పారు.

చిరుత బారి నుంచి ప్రాణాలకు రక్షణ కల్పించండి

తిమ్మనాయుడుపాలెం వాసుల ఆవేదన



సీసీ కెమెరాలో రికార్డైన చిరుత సంచారం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి కరకంబాడి మార్గంలోని తిమ్మనాయుడుపాలెం సరిహద్దు అటవీ ప్రాంతంలో చిరుత బారి నుంచి ప్రాణాలను కాపాడాలని కాలనీ వాసులు వేడుకుంటున్నారు. వన్యప్రాణులు సమీప కాలనీ ప్రాంతాలకు వస్తున్నాయని, వాటి నుంచి రక్షణగా గోడ నిర్మించాలని గత రెండేళ్లుగా అటవీ శాఖ అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. అడవి నుంచి చిరుతలు క్రమంగా ఈ ప్రాంతంలో సంచరిస్తున్నాయని అనేక మార్లు డిఎఫ్‌వోకి, ఫారెస్ట్ రేంజర్‌కు ఫిర్యాదులు చేశామని, వారు నిధులు లేవని చెప్పినట్లు కాలనీ వాసులంటున్నారు. ఈ సమస్యపై 2022లో అప్పటి పిసిసిఎఫ్ మధుసూదన్ రెడ్డికి చెప్పగా ఆయన ఈ సమస్యకు పరిష్కారం చూపాలని జిల్లా అటవీ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. అయినా ఇప్పటికీ పరిష్కారం చూపలేదని అక్కడి స్థానికులు వాపోతున్నారు. తాజాగా గురువారం అర్ధరాత్రి చిరుత జనావాస ప్రాంతాలలో సంచరించడం సీసీ కెమెరాలలో రికార్డు అయ్యిందని స్థానిక ప్రజలు తెలిపారు. ఇప్పటికైనా సమస్యకు పరిష్కారం చూపాలని అటవీ శాఖ అధికారులను స్థానిక ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ఆటో డ్రైవర్లకు సీఐ సుబ్బరామిరెడ్డి సూచన

ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ

ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి): ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సీఐ సుబ్బరామిరెడ్డి ఆటో డ్రైవర్లకు సూచించారు. గురువారం చంద్రగిరి పోలీస్‌స్టేషన్ వద్ద ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆటోలకు సంబంధించిన రికార్డులను పక్కాగా ఉంచుకోవాలని సూచించారు. ప్రధాన కూడళ్లలో ఆటోలను క్రమ పద్ధతిలో నిలపాలని, మహిళలతో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. తాగి ఆటో నడిపితే రూ.10వేల చలానాతో పాటు నెల రోజుల జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ అనిత, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-సత్యవేడు: సత్యవేడు, దాసుకుప్పం సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ సబ్ ఇంజనీర్ రాజ్ కిరణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్, విద్యుత్ స్తంభాల మరమ్మతులు, చెట్టు కొమ్మల కత్తరింపు వంటి పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుదని తెలిపారు. ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు.

డ్రైనేజీ కాలువకు మరమ్మతులు

డ్రైనేజీ శుభ్రం చేయిస్తున్న ఈవో షణ్ముగం

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: నారాయణవనం మేజర్ పంచాయతీలో డ్రైనేజీ కాలువలకు ఈవో షణ్ముగం ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టారు. పారిశుధ్య సమస్యలపై పలువురు ఈవోకి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన గురువారం మురుగునీటి కాలువలను శుభ్రం చేయించారు. పలు చోట్ల పాడైపోయి ఉన్న కాలువలకు మరమ్మతలు చేయించారు. దీంతో పలువురు ఆయనను అభినందించారు. ఈవో స్పందించిన తీరుపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే 'పల్లె పండుగ'

- వారోత్సవాలు విజయవంతం చేయాలి
- డ్వామా పీడీ సివి శ్రీనివాస ప్రసాద్

కూలీలతో మాట్లాడుతున్న పీడీ శ్రీనివాస ప్రసాద్

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: ప్రజలందరి భాగస్వామ్యంతోనే 'పల్లె పండుగ'ను ఘనంగా నిర్వహించవచ్చునని డ్వామా పీడీ సివి శ్రీనివాస ప్రసాద్ అన్నారు. గురువారం ఆయన ఏర్పేడు మండలంలో ఉపాధి హామీ పనులను తనిఖీ చేశారు. అక్కడి పరిస్థితులను కూలీలతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు వారం రోజులపాటు పంచాయతీలలో 2024-2025 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులు, పూర్తయిన పనులు, లేబర్ బడ్జెట్ వంటి సమాచారంను సిటిజన్ ఇన్ఫర్మేషన్ బోర్డుల ద్వారా ప్రభుత్వ కార్యాలయాల వద్ద, జన సమూహాల వద్ద ప్రదర్శించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, సిమెంట్ డ్రైన్లు, మినీ గోకులం, రైతుల పొలాల్లో ఫారం పాండ్ల తవ్వకం, కొత్తగా చేపట్టబోవు పనులకు ప్రజాప్రతినిధుల ద్వారా భూమి పూజ కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కార్యక్రమాధికారులు చంద్రశేఖర్ రాజు, అవిలాలదేవరి, జూనియర్ ఇంజనీర్ పాండజా బాలాజీ రావు, టెక్నికల్ అసిస్టెంట్ పట్టాభిరెడ్డి, మునియ్య, కూలీలు పాల్గొన్నారు.

'ఉపాధి' ఫీల్డ్ అసిస్టెంట్‌పై కక్షసాధింపులు

ప్రజాశక్తి - ఓజిలి

జాతీయ ఉపాధి హామీ పథకం రాజకీయ వేదికగా మారుతుంది. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో అధికారులు కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని ఫీల్డ్ అసిస్టెంట్ పులికొండ శివరాజా పేర్కొన్నారు. గురువారం మీడియాతో తనకు జరిగిన అన్యాయంపై మాట్లాడారు. మండల పరిధిలోని వెంకటరెడ్డిపాలెం పంచాయతీలో గత రెండున్నర సంవత్సరాలుగా జాతీయ ఉపాధి హామీ పథకంలో క్షేత్ర సహాయకుడిగా విధులు నిర్వహిస్తున్నానని,ఎలాంటి అవినీతికి పాల్పడని తనపై అధికారి పార్టీకి చెందిన నాయకులు కక్ష సాధింపులకు పాల్పడుతున్నారన్నారు. ఉద్దేశపూర్వకంగానే 15 మంది పేర్లను పెట్టి హాజరు వేసి ఆ నగదును దుర్వినియోగం చేశానని తనపై తప్పుడు నివేదికతో టిడిపి నాయకులు అధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై పిడి శ్రీనివాస్ ప్రసాద్ ఏపీఓ ఉషారాణికి షాకాజ్ నోటీసు జారీ చేసి ఎంపీడీవో వీ.రజనీకాంత్ విచారణ జరిపించాలని ఆదేశించారు. విచారణకు వచ్చిన అధికారులు టిడిపి నాయకులతో కలిసి టీడీపీ సానుభూతిపరులతో తూతూ మంత్రంగా విచారణ చేపట్టి పిడి శ్రీనివాస ప్రసాద్‌కు తప్పుడు నివేదికను సమర్పించడంతో అకారణంగా తనను తాత్కాలికంగా తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి తనకు న్యాయం చేయాలని వేడుకొన్నారు.

నకిలీ బంగారంతో రూ. 5లక్షలు కాజేసిన కేటుగాడు

- ఏ రంగంపేటలో నకిలీ బంగారంతో ఘరానా మోసం

ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి): తక్కువ ధరకు బంగారాన్ని ఇస్తానని నమ్మజెప్పి నకిలీ బంగారాన్ని ఇచ్చి ఐదు లక్షల రూపాయలు కాజేసిన సంఘటన చంద్రగిరి మండలం, ఏ రంగంపేట గ్రామంలో గురువారం సాయంత్రం వెలుగులోకి వచ్చింది. మండలంలోని ఏ రంగంపేట గ్రామానికి చెందిన పూజారి సుబ్రహ్మణ్యం కుమారుడు తిరుపతిలో ఆటో నడిపేవాడు. ఈ సందర్భంలో కర్నూలుకు చెందిన రమేష్ అనే వ్యక్తి పరిచయమై తమ దగ్గర స్వచ్ఛమైన బంగారు ఉంది తక్కువ ధరకు అమ్ముతామని, ఏమైనా కొనుక్కుంటారా అని అడగడంతో తన తండ్రి సుబ్రహ్మణ్యం ఫోన్ నెంబర్ ఇచ్చాడు. ఘరానా మోసగాడు రమేష్ సుబ్రహ్మణ్యంకు ఫోన్ చేసి తమ పొలంలో మాకు బంగారం దొరికింది మేము తక్కువ ధరకు బంగారం ఇస్తామని నమ్మబలికి ఒక గ్రాము బంగారాన్ని కూడా రమేష్ సుబ్రహ్మణ్యంకు నాలుగు నెలల క్రితం ఇచ్చి నమ్మించాడు. పూజారి సుబ్రహ్మణ్యం ఆ బంగారాన్ని బంగారు తయారు చేసే ఆచారి వద్ద పరీక్షించగా స్వచ్ఛమైన బంగారని తేలింది. దీంతో పూజారి సుబ్రహ్మణ్యం అత్యాశతో తక్కువ ధరకు బంగారు లభిస్తున్నదని ఒక కేజీ బంగారాన్ని పది లక్షలకు రమేష్ వద్ద బేరం కుదుర్చుకున్నాడు. రెండవసారి నకిలీ బంగారాన్ని కవర్లో పొట్లం కట్టుకుని వచ్చి పూజారి సుబ్రహ్మణ్యం వద్ద రూ.5లక్షలు తీసుకొని, మిగిలిన 5లక్షల గడువు ప్రకారం చెల్లించాలని నకిలీ బంగారాన్ని ఇచ్చాడు. దీంతో పూజారి సుబ్రహ్మణ్యం ఇంటి వద్దకు వెళ్లి పరిశీలించగా నకిలీ బంగారుగా గుర్తించి వెంటనే రమేష్‌కు ఫోన్ చేశాడు. రమేష్ ఫోన్ అంతలోనే స్విచ్ ఆఫ్ చేసి పారిపోయాడు. దీంతో ఏమీ చేయలేక సుబ్రహ్మణ్యం దంపతులు నకిలీ బంగారాని రమేష్ తమకు అమ్మి ఐదు లక్షల రూపాయలు టోకరా కొట్టాడని గురువారం సాయంత్రం చంద్రగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుబ్బరామిరెడ్డి తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం సాయంత్రం తొట్టంబేడు మండలం కొన్నలి గ్రామం వద్ద చోటుచేసుకుంది. తొట్టంబేడు ఎస్ఐ ఈశ్వరయ్య కథనం మేరకు.. పెళ్లకూరు మండలం పునబాకు గ్రామానికి చెందిన నలుగూరు శేఖర్(33)కు సొంత ట్రాక్టర్ ఉంది. వ్యవసాయ పనుల నిమిత్తం అత్తగారి ఊరైన తొట్టంబేడు మండలంలోని కొన్నలి గ్రామానికి వెళ్ళాడు. బుధవారం సాయంత్రం వరి విత్తనాలు కొనుగోలు చేసేందుకు రైతులతో కలిసి ట్రాక్టర్‌ను తీసుకుని శ్రీకాళహస్తి పట్టణానికి వెళుతుండగా కొన్నలి సమీపంలోనే బోల్తాపడింది. ఈ సంఘటనలో ట్రక్కులో కూర్చుని ఉన్న శేఖర్ తీవ్రంగా గాయపడ్డాడు. సహచర రైతులు ఆయన్ను చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. పోలీసులు మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్యా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పుట్టింట వ్యవసాయ పనుల్లో సాయం చేయడానికి వెళ్లి భర్త తిరిగిరాని లోకాలకు చేరడంతో శేఖర్ భార్య కన్నీరుమున్నీరై ఏడ్వడం అక్కడున్నావారిని కంట తడి పెట్టించింది. శేఖర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

బోల్తా పడ్డ ట్రాక్టర్

శేఖర్(ఫైల్)

ముగిసిన ఎన్‌సిసి క్యాడెట్‌ల ట్రెక్కింగ్ యాత్ర

ఎన్‌సీసీ విద్యార్థులు

ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతి గ్రూప్‌కు చెందిన 35(ఎ) బెటాలియన్ 15మంది శాశ్వత శిక్షకులు (పి.ఐ), 13 అసోసియేటెడ్ ఎన్‌సిసి ఆఫీసర్లు (ఏఎన్ఓలు)తో కలిసి 506మంది ఎన్‌సిసి క్యాడెట్‌లతో కూడిన ఎపి ట్రెక్-1 అనే ట్రెక్కింగ్ యాత్ర నిర్వహించింది. గురువారం ఎన్‌సిసి క్యాడెట్‌ల ట్రెక్కింగ్ యాత్ర శ్రీవారి మెట్టు మార్గంలో తిరుమలకు పాదయాత్ర ప్రారంభమై, సాయంత్రానికి ముగిసింది. తమ గమ్యస్థానానికి చేరుకున్న తర్వాత, క్యాడెట్లు, సిబ్బంది ఆలయంలో లార్డ్ బాలాజీకి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా గ్రూప్ కమాండర్ మాట్లాడుతూ విద్యార్థులలో స్ఫూర్తి ఈ యాత్ర నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'పల్లె పండుగ'ను ఘనంగా నిర్వహిద్దాం

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గూడూరు టౌన్: ప్రభుత్వం చేపట్టదలచిన పల్లె పండుగను ఘనంగా నిర్వహిద్దామని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన అధికారులు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు. పల్లె ప్రగతి సాధించేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు కొండూరు వెంకటేశ్వర్లు రాజు, వెంకటేశ్వర్లు రెడ్డి, గణపర్తి కిషోర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చంద్ర ప్రభ వాహనంపై కళ్యాణ వెంకన్న

వాహన సేవలో పాల్గొన్న చెవిరెడ్డి దంపతులు

ప్రజాశక్తి-రామచంద్రాపురం(తిరుపతి రూరల్): తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవరోజు స్వామివారు గురువారం ఉదయం సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి చంద్ర ప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. వాహన సేవల్లో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, చెవిరెడ్డి లక్ష్మి, కుమారులు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డిలు వెన్నంటి నడిచారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- పెన్నలపాడు, బండారుపల్లి రీచ్‌లలో..
- ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి అర్ధరాత్రి తనిఖీలు

ఇసుక రీచ్ వద్ద తనిఖీ చేస్తున్న ఆర్‌డీవో

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపనున్నట్లు శ్రీకాళహస్తి ఆర్‌డీవో భానుప్రకాష్ రెడ్డి అన్నారు. ఇసుకను సొంత అవసరాలకు కాకుండా వ్యాపారావసరాలకు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నియోజకవర్గం పరిధిలోని స్వర్ణముఖి నది నుంచి పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణా జరుగుతుందన్న విషయం ఇటీవల పెద్ద ఎత్తున వివిధ దినపత్రికల్లో వచ్చిన నేపథ్యంలో ఆర్‌డీవో స్పందించారు. గురువారం అర్ధరాత్రి తొట్టంబేడు మండలం పెన్నలపాడు రీచ్, ఏర్పేడు మండలం బండారుపల్లి రీచ్‌లను తన సిబ్బందితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెన్నలపాడు రీచ్ వద్ద తవ్వకాలు జరగకుండా బుధవారం రాత్రి ట్రెంచ్ కొట్టినట్లు ఆర్‌డీవో తెలిపారు. ఫలితంగా ఇక్కడ ఇసుక అక్రమ తవ్వకాలు జరిగే అవకాశం లేదనీ, ప్రస్తుత తనిఖీల్లో కూడా ఎక్కడా కూడా జెసిబిలు, హిటాచీలు కానరాలేదని వివరించారు. అనంతరం బండారపల్లి ఇసుక రీచ్‌లో తనిఖీలు నిర్వహించారు. తొట్టంబేడు ఎస్ఐ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతి విశ్వం టాలెంట్ స్కూల్‌లో విశ్వం సైనిక్, నవోదయ ప్రవేశ పరీక్షల స్టడీ మెటీరియల్స్‌ను ఎమ్మెల్సీ, అప్పుస్మా రాష్ట్ర అధ్యక్షులు ఎంవి రామచంద్ర రెడ్డి, విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వ చందన్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 సైనిక్ స్కూల్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకుతో పాటు 63 సీట్లను, నవోదయ ఫలితాల్లో 59సీట్లు సాధించి విజయభేరి మోగించారని తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో మంచి స్టడీ మెటీరియల్ అందించి ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నట్లు వెల్లడించారు. నాయకులు శ్రీనివాసులు రెడ్డి, వాసుదేవయ్య, రవీంద్రరెడ్డి, భాస్కర రాజు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, పుత్తూరు వారి కోర్టులో

IA No: 309 / 2023
O.S.No.: 360 / 2022

కె. పరందాముడు ... పిటీషనర్ / ప్రతివాది
And
శ్రీపురం వెంకటరెడ్డి ... రెస్పాండెంట్ / వాది

రెస్పాండెంట్ వారికి నోటీసు

ఎస్. వెంకట్ రెడ్డి, తండ్రి లేట్ ఎస్. నరసింహా రెడ్డి, కూనెపల్లె గ్రామం, బొప్పరాజుపల్లె పోస్టు, రామచంద్రాపురం మండలం, తిరుపతి జిల్లా.

పై కనిన దావా నందు మధ్యంతర ఉత్తర్వుల కొరకు పిటీషనర్ / ప్రతివాది I.A.No. 309/2023 దాఖలు చేసియున్నారు. సదరు తారీఖున మీరు నేరుగా కాని, లాయరు ద్వారాగాని హాజరై తమకు గల ఆక్షేపనలు తెలియజేయగలరు. లేని పక్షమున మీకు పరోక్షమున తీర్మానించెదరు.

వాయిదా తేది : 23-10-2024

Ch.M.S. Raja
Advocate, TIRUPATI.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE :: PUTTUR
I.A.NO.176/2024, A.S.NO.5/2015
O.S.NO.15/2008
on the file of Principal Junior Civil Judge, Puttur.

Between:
V. Subramanyam (Died) V. Sundaramma and others ...**Appellants/Petitioners**
And:
S.Munaswamy (died) Lrs S. Krishna venamma and others
... **Respondents**

NOTICE TO RESPONDENT NOS.3 AND 5 BY PUBLICATION

1. Anasuya, D/o S. Munaswamy, W/o S. Murali. R3
2. Sai D/o S.Munaswamy, W/o Bhaskar.R5

Both are residing at Vijinaidu Kandiga village, Puttur Mandal, Tirupati District.

Madam,

Please take notice that the appellants have filed I.A.176/2024 to implead you as Lrs of deceased S.Munaswamy in the appeal and the same is posted to 16.10.2024 for the appearance of 3 and 5 respondents before this Hon'ble Court at 10.30 a.m., either in person or through advocates. If you fail to appear on that day, the matter will be decided exparte as against you and next steps will be passed in the appeal. This is the order of this Hon'ble Court.

V. UDHAYAKUMAR, B.Com., B.L.,
Advocate for the Appellants
Cell: 9000858936